క్లుప్తంగా

పొన్నూరమ్మకు ప్రత్యేక పూజలు



మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామ దేవత పొన్నూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఇళ్ల వద్ద నుంచి బోనాలను తలపై పెట్టుకుని ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పొన్నూరమ్మకు ప్రత్యేకాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామానికి చెందిన ఈగ సురేష్–సుభాషిణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అమ్మవారికి సవర బంగారు ఆభరణాలను సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విష్ణాలయంలో ఏకాదశి పూజలు

మనుబోలు మండల కేంద్రంలోని విష్ణాలయంలో ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి సంప్రదాయబద్ధంగా పూజలు జరిపించారు. ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి–కళ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఖాజానగర్‌లో వైద్యశిబిరం



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్ పీర్లచావిడి వద్ద నెల్లూరుకు చెందిన శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కల్యాణి, చిరంజీవి పాల్గొని పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందజేసి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. ఇక్కడ పరీక్షలు చేయించుకున్న వారికి నెల్లూరులోని తమ వైద్యశాలలో నెల రోజుల పాటు ఉచితంగా ఓపీ ఉంటుందని తెలిపారు. అలాగే మందులు, పరీక్షల్లో రాయితీలు ఉంటాయన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని దారికాచి అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై ముగ్గురు కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన యాతం పెంచలరెడ్డి తన తోటకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి, గంగాధర్, జనార్దన్‌లు పెంచలరెడ్డిని అడ్డగించి వెంట తీసుకొచ్చిన కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో పెంచలరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాధితుడ్ని పొదలకూరు సీహెచ్‌సీకి తరలించి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : గేదె అడ్డురావడంతో మోటారు బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి వద్ద ఆదివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన కృష్ణమోహన్ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా గేదె అడ్డురావడంతో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భగవద్గీత ప్రతుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో భగవద్గీత ప్రతులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురమౌళి మాట్లాడుతూ సెప్టెంబర్ 6న వచ్చే కృష్ణాష్టమిని పురస్కరించుకుని వీటిని పంపిణీ చేశామన్నారు.

ఆరోగ్య భద్రత కోసమే గుండె భరోసా

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గుండె సంబంధిత సమస్యలను ముందుగా తెలుసుకోవడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని, ప్రజల ఆరోగ్య భద్రత కోసమే రాజన్న గుండె భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 13వ డివిజన్ ప్రజల కోసం రాజన్న గుండె భరోసా కార్యక్రమాన్ని యలమవారిదిన్నెలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఎనెల్ ఆస్పత్రి సహకారంతో గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హాజరైన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులతో పాటు గుండెలో ఇబ్బందులున్న వారికి యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లను చేయించనున్నామని వెల్లడించారు. 131 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశామని ఎనెల్ ఆస్పత్రి వైద్యుడు నాగేంద్రప్రసాద్ తెలిపారు. కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



రిపోర్టులను అందజేస్తున్న అనిల్‌కుమార్

ఎంపీ వేమిరెడ్డితో పలువురి భేటీ

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా ఆదివారం కలుసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన ఆయన్ను అభినందించి సత్కరించారు.

• వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వేర్వేరుగా కలిసి ఎంపీని సత్కరించారు.

• మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు సునీత మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కాకులూరి శ్రీనివాసులు, పెంచలయ్య, కృష్ణయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.



• పల్లిపాడుకు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లిపాడు మాజీ సర్పంచ్ జయరామయ్య మాట్లాడారు. గ్రామాన్ని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దత్తత తీసుకొని అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ సుమన్‌రెడ్డి, ఎంపీటీసీ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం

నెల్లూరు(బృందావనం): ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్ల సమావేశాన్ని నరుకూరులోని ఆర్యవైశ్య వృద్ధజన సేవా సమితి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేశారు. ఆశ్రమానికి టీవీ, ఆరు ఫ్యాన్లు, ఆగస్టులో జన్మించిన 11 మంది వృద్ధులకు వస్త్రాలను అందజేశారు. అనంతరం అసోసియేషన్ కార్యాలయంలో ఆశ్రమ అధ్యక్షుడు పెసల రామ్మోహన్‌రావు, కరూర్ వైశ్య బ్యాంక్ నెల్లూరు శాఖ సీనియర్ మేనేజర్ బాలవీరాంజనేయులును సన్మానించారు. ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాఖ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, అద్దెపల్లి సుబ్బారావు, నిర్వాహకులు వోలేటి ప్రభాకర్‌రావు, బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

3న చండీ హోమం

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో చండీ హోమాన్ని సెప్టెంబర్ మూడున నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ చైర్మన్ నాగయ్య, అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా చైర్మన్ నగిరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఈఓ దర్గయ్య, పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు, తదితరుల సమక్షంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. దేవస్థానాన్ని పునర్నిర్మించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కమిటీ నిర్వాహకులు ఆరణి వెంకటశేషయ్య, శేఖర్, ధనుంజయ, సుధాకర్‌రెడ్డి, భీమయ్య, పాంచాలి, వెంకటేశ్వర్లు, చిట్టమూరు మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఉత్సాహంగా సంగీత, సాహితి కార్యక్రమం



నెల్లూరు(బృందావనం): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు రామ్మూర్తి జయంతిని మినీబైపాస్ రోడ్డులోని ఓ నర్సరీలో గోవిందరాజు సీతాదేవి సాహితి వేదిక అధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి అందించిన సేవలను కీర్తిస్తూ సాహితీ, సంగీత కార్యక్రమాన్ని జరిపారు. అమెరికా తెలుగు అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో బహుమతి పొందిన మోపూరు పెంచలనరసింహం, రాష్ట్రస్థాయిలో ఎక్స్‌రే అవార్డును అందుకున్న నల్లు రమేష్‌బాబు, అవ్వారు శ్రీధర్‌బాబును గోవిందరాజు సీతాదేవి సాహితీ పురస్కారాలతో సత్కరించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. మెట్టు రామచంద్రప్రసాద్, శ్రీవత్సల, లక్ష్మీభవాని, డాక్టర్ గిరిజాలక్ష్మి, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, రాజా, అంకంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య' విద్యార్థికి ఐఐటీలో సీటు



చిరంజీవి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొండాయపాళెంలోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో ఉంటూ విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థి చిరంజీవి పోతురాజు భువనేశ్వర్‌లోని ఐఐటీలో సీటు సాధించారు. ఈ మేరకు ఆశ్రమ సెక్రటరీ సాంబశివరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. విద్యార్థిని ఆయన అభినందించారు.

గ్రూప్ - 2 పరీక్షలపై అవగాహన



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (టౌన్): మద్రాస్ బస్టాండ్ సెంటర్ సమీపంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్‌లో గ్రూప్ – 2 పరీక్షలపై నిరుద్యోగులకు అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు సిలబస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆంధ్రుల చరిత్ర, ఆర్థిక స్థితిగతులపై బుక్‌లెట్‌ను ఉచితంగా అందజేశారు. ప్రొఫెసర్ నలిమి, శ్రీహర్ష కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పేకాట కేంద్రంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వివరాలు.. పెన్నాలో పేకాటాడుతున్నారనే పక్కా సమాచారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీకి అందింది. ఈ క్రమంలో ఆయన పర్యవేక్షణలో సిబ్బంది శనివారం రాత్రి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.23 వేలను స్వాధీనం చేసుకున్నారు.

19 నుంచి వినాయక చవితి ఉత్సవాలు



సమావేశమైన గణేశ్ ఉత్సవ సమితి నేతలు

నెల్లూరు(బృందావనం): నగరంలో సెప్టెంబర్ 19 నుంచి 23 వరకు నిర్వహించనున్న గణేశ్ ఉత్సవాలను జయప్రదం చేయాలని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నేతలు కోరారు. వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన విస్తృత స్థాయి సమావేశాన్ని నగరంలోని శ్రీనివాసాగ్రహారంలో గల ఓ కన్వెన్షన్ హాల్లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నగరంలోని పలు కూడళ్లలో సెప్టెంబర్ 19న గణేశ్ విగ్రహాలను ప్రతిష్టించి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. విగ్రహాలను 23న నిమజ్జనం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. స్వర్ణాల చెరువు సమీపంలోని గణేశ్ ఘాట్, పెన్నా బ్యారేజీ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గణేశ్ మండపాల ఏర్పాటు, తదితర అనుమతులకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులను కోరనున్నామన్నారు. తాత్కాలిక మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గానూ వారితో సమావేశాన్ని టీవీఎస్ కల్యాణసదన్‌లో సెప్టెంబర్ ఒకటిన నిర్వహించనున్నామని వెల్లడించారు. వివరాలకు 80081 70088, 93932 37897 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి గౌరవ సలహాదారు ఆనం రంగమయూర్‌రెడ్డి, అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కోశాధికారి మోహన్‌రావు, నీలి రాఘవ, కొణిదెల సుధీర్, పాతపాటి అశోక్, వంశీధర్‌రెడ్డి, చేజర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో దంత శస్త్రచికిత్సలు విజయవంతం

నెల్లూరు(బారకాసు): చింతారెడ్డిపాళెంలోని నారాయణ దంత వైద్యశాలలో అతి తక్కువ కాలంలో 3500 శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించామని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్ పేర్కొన్నారు. ఈ మేరకు దంత కళాశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధునాతన పద్ధతుల్లో ఆపరేషన్లను సురక్షితంగా చేయగల సామర్థ్యం గల ఓరల్ మాక్సిల్లోఫేషియల్ సర్జరీ విభాగం తమ వైద్య కళాశాలలోనే ఉందని పేర్కొన్నారు. ఓరల్ సర్జరీ విభాగాధిపతి సత్యకుమార్‌రెడ్డి, నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, డీన్ నువ్వుల శివకుమార్, కో ఆర్డినేటర్ డాక్టర్ సునీల్‌కుమార్, ఓరల్ సర్జరీ వైద్య నిపుణులు సత్యకుమార్, కిశోర్‌కుమార్, రాజశేఖర్, శ్రీధర్‌రెడ్డి, రమేష్‌బాబు, హరిప్రియ, ఏఓయూ అరవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

నేత్రదానంపై అవగాహన

నెల్లూరు(బారకాసు): మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి చూపును ప్రసాదించొచ్చని మోడరన్ ఐ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ విష్ణుతేజ పేర్కొన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని చిల్డ్రన్స్ పార్కులో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేశారు. హాస్పిటల్ కంటి వైద్యుడు కృష్ణమూర్తి, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణుతేజ

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దర్గామిట్టలోని రక్షణ సైన్య ప్రార్థన మందిరంలో క్రీస్తు శిలువ టవర్‌ను ఆదివారం పునఃప్రతిష్ఠించారు. చెన్నైకు చెందిన కల్నల్ యాకూబ్ మాసీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టవర్ నిర్మాణానికి రూ.ఆరు లక్షల విరాళాన్ని రాజ్‌కిషోర్ అందజేశారని చెప్పారు. అనంతరం యాకూబ్ మాసీని సత్కరించారు. ప్రార్థన మందిర నిర్వాహకులు లూథర్ శామ్యూల్, సాత్వికం, తలారి బాలసుధాకర్, విజయప్రసాద్, చంద్రరాజు, ప్రతాప్, అప్పయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డయల్ యువర్ కమిషనర్ నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహించనున్నామని, 0861 2355678 నంబర్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. స్పందనలో అర్జీలను తనకు సమర్పించాలని సూచించారు.

జెడ్పీ వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పలువురు జెడ్పీ వాకర్స్ సభ్యులను ఆదివారం సత్కరించారు. నిండు నూరేళ్లు వర్ధిల్లు కార్యక్రమంలో భాగంగా అనంతరావు, ఖాసిం, చెంచురామ్మూర్తిని సన్మానించారు. డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, ఖాజామస్తాన్, చెంచయ్య, రాజగోపాల్, ఎస్తేరురాణి, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

[illegible]

ఆస్తి షెడ్యూల్

[illegible]

పి.వి.సాయికుమార్‌రెడ్డి, అడ్వకేట్, గూడూరు

దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతులు

• తోటల్లో తగ్గిన దిగుబడి
• పెరిగిన ధరలు

పొదలకూరు: దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతులు బాగా పెరిగాయి. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల వ్యాపారులు స్థానిక యార్డు నుంచి ధరలు పెంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నిమ్మ కిలో రూ.40 నుంచి రూ.55 పలుకుతోంది. బస్తా కాయలు రూ.5 వేలకు వరకు ధర పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి తగ్గడం వల్ల ఇటీవల కాయలు ధరలు పెరిగియి. ప్రస్తుతం శ్రావణ మాసంలో వచ్చే అమావాస్య కారణంగా ముఖ్యంగా తమిళనాడు వాసులు విపరీతంగా నిమ్మకాయలను వినియోగిస్తారు. ఫలితంగా చెన్నైకు పొదలకూరు మార్కెట్ నుంచి ఎగుమతులు అధికమయ్యాయి. ఇటీవల వరకు కాయల ధరలు తగ్గిపోయి రైతులు డీలాపడినా ప్రస్తుతం కొంత ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి ఉంది. అయితే నాణ్యతగా ఉన్న కాయలకే ధరలు గిట్టుబాటు అవుతున్నట్లు వ్యాపారులు వెల్లడించారు.



మార్కెట్‌లో నిమ్మకాయలు

అక్టోబర్ వరకు ఇలాగే..

రైతుల తోటల్లో కాయల దిగుబడి గణనీయంగా తగ్గింది. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించకుండా చాలామంది రైతులు నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. ఫలితంగా సీజన్లతో పనిలేకుండా కొన్ని తోటల్లో కాయలు దిగుబడి తగ్గుతోంది. దీంతో డిమాండ్ పెరిగి ధరలు గిట్టుబాటు అవుతున్నట్లుగా వ్యాపారులు వెల్లడిస్తున్నారు. అక్టోబర్ నెల వరకు కాయల దిగుబడి ఇలాగే ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు తోటలకు నీరు పెట్టకుండా ఎండబెట్టడంతో దిగుబడి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. తరచూ తోటలను ఎండబెడితే పూత శాతం పెరుగుతుందని రైతులు తోటలను ఎండబెడుతున్నారు.